

వీఎంఆర్‌డీఏలో 100 రోజుల ప్రణాళిక
అధికారుల కసరత్తు -6వ పేజీలో
అభివృద్ధి పనుల పూర్తికి యత్నం



బొత్స ఎంపికపై గరంగరం

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పొరుగు జిల్లా నేతను ఎంపిక చేయడంపై ఉమ్మడి జిల్లా వైసీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి

- పక్క జిల్లా నాయకుడిని తీసుకువచ్చి పోటీ చేయించాల్సిన అవసరమేమిటంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో నాయకులే లేరా...అంటూ ప్రశ్నలు
- మొన్న ఆయన భార్యకు ఎంపీ సీటు...
- ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ సీటు
- ఎన్నిక అనివార్యమైతే బొత్స విజయం కోసం ఎంతమంది మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


బొత్స సత్యనారాయణ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఖరారు చేయడంపై వైసీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ బయటకు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానం కోసం ఎంతోమంది కాచుకు కూర్చున్నారు. సాధారణ ఎన్నికల్లో అవకాశం కల్పించలేకపోయిన వారికి ఇస్తారని కోలా గురువులు వంటి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఊహించని విధంగా పార్టీ అభ్యర్థులంతా ఓడిపోవడంతో అందరి కళ్లు శాసన మండలిపై పడ్డాయి. ఎలాగైనా అధికారంలో కొనసాగాలనే తాపత్రయంతో మొన్నటివరకు అధికారం అనుభవించిన వారంతా ఈ ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశించారు. కానీ ఊహించని విధంగా పక్క జిల్లా నాయకుడు బొత్సను అభ్యర్థిగా ప్రకటించడంతో అంతా కంగుతిన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పోటీకి దింపుతున్నట్టు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులతో అమరావతిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్నాక, బొత్సను అభ్యర్థిగా ఖరారు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతా నవ్వు ముఖాలు పెట్టినా లోలోపల మాత్రం కుతకుతలాడిపోతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన నాయకుడిని తీసుకువచ్చి ఇక్కడ పోటీకి దింపడం ఏమిటంటూ రుసరుసలాడుతున్నారు. అసలు...ఈ టికెట్ బొత్సకు ఇస్తారని ఎవరూ ఊహించలేదు. ఆయన పోటీలో ఉన్నారనే విషయం కూడా ఎక్కడా బయటకు పొక్కలేదు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో ఓట్లు వేసేది ఉమ్మడి విశాఖ జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రమే. అన్ని పార్టీలకు కలిపి మొత్తం 822 మంది ఉన్నారు. రెండున్నరేళ్ల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు రెండు స్థానాలకు వైసీపీ తరఫున వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణిలను పోటీకి దింపారు. అప్పుడు కూడా కళ్యాణి అభ్యర్థిత్వంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమెకు ఇక్కడ ఎలా అవకాశం ఇస్తారని ప్రశ్నించారు. అంతకు ముందు ఎన్నికల్లో ఆమె అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ తరఫున పనిచేశారని పార్టీ సర్ది చెప్పింది. దాంతో నాయకులు సరిపెట్టుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే కోటా సీటు ఖాళీ అయితే జిల్లాలో నాయకులు ఎంతోమంది ఉండగా...పొరుగు జిల్లాకు చెందిన బొత్సను ఎంపిక చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూడా విశాఖ ఎంపీగా బొత్స భార్య ఝాన్సీలక్ష్మిని పోటీకి దింపారు. అప్పుడు ఎవరూ పెద్దగా బాధ పడలేదు. ఎవరికీ ఎంపీగా పోటీ చేసే ఆలోచన, అంత మొత్తం ఖర్చు పెట్టే స్థోమత లేకపోవడంతో మిన్నకున్నారు. ఏమి చేసినా తాము ప్రశ్నించలేమనే ధీమాతోనే అధిష్ఠానం ఇప్పుడు బొత్సను ఎంపిక చేసిందని ... మిగతా 6వ పేజీలో

నష్టాల్లో కూరుకుపోతున్న ఉక్కు

వ్యయం రూ.60 వేలు
ఆదాయం రూ.50 వేలు!

టన్నుకు రూ.10 వేల నష్టం

- సొంత గనులు లేకపోవడం, ముడి పదార్థాలు అధిక ధరకు కొనుగోలు చేయాల్సి రావడం ప్రధాన కారణాలు
- అసలు సమస్యలను పక్కనపెట్టి అధికారుల నాటకాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు నష్టాలకు అసలు కారణాలను యాజమాన్యం దాచిపెడుతోంది. కేంద్రానికి స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా జాప్యం చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో టన్ను స్టీల్ తయారు చేయడానికి రూ.60,401 ఉత్పత్తి వ్యయం అయితే దానిని బహిరంగ మార్కెట్‌లో రూ.50,145కి విక్రయించారు. అంటే టన్నుకు సగటున రూ.10 వేలు నష్టం వచ్చింది. అంతకు ముందు ఏడాది అంటే 2022-23లో ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.64,042 అయితే దానిని మార్కెట్‌లో టన్ను రూ.56,111 చొప్పున విక్రయించారు. ఆ ఏడాది టన్నుకు రూ.8 వేలు నష్టం వచ్చింది. ఇదే స్టీల్‌ను ఇతర స్టీల్‌ప్లాంట్లు కూడా తయారుచేసి విక్రయిస్తున్నాయి. వాటిని నష్టం రావడం లేదు. కారణం వారికి ఉత్పత్తి వ్యయం తక్కువ కావడమే. వారికి సొంత గనులు ఉండడం, ముడి పదార్థాలను తక్కువ ధరలకు కొనడం వల్ల ఉత్పత్తి వ్యయం తక్కువ పడుతోంది. లాభాలు వస్తున్నాయి. విశాఖ ఉక్కుకు సొంత గనులు లేకపోవడం వల్ల బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు వాటిని కొని ఉత్పత్తి చేస్తోంది. దాని వల్ల నష్టాలు వస్తున్నాయి.

సొంత ఐరన్‌ఓర్ గనులు లేకపోవడమే సమస్య

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని ఎప్పటి నుంచో కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్రాలు పట్టించుకోవడం లేదు. సెయిల్‌కు సొంత గనులు ఉన్నాయి. ఐరన్‌ఓర్ తక్కువ ధరకే లభిస్తోంది. విశాఖ స్టీల్‌కు, సెయిల్‌కు ఐరన్‌ఓర్ ... మిగతా 6వ పేజీలో



స్టీల్ తయారీలో 40 శాతానికి పైగా వ్యయం కోకింగ్ కోల్‌దే. దీనిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఆ తరువాత ఐరన్ ఓర్ వ్యయం 17 నుంచి 18శాతం ఉంటుంది. ఉత్పత్తి వ్యయంలో 67 నుంచి 68 శాతం ముడి పదార్థాలదే. మిగిలిన 33 నుంచి 32 శాతం వ్యయం జీతాలు, విడిభాగాలు, విద్యుత్, నీరు, తరుగుదల, వడ్డీలు ఉంటాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో విశాఖ ఉక్కు కర్మాగారంలో టన్నుకు అయిన ఉత్పత్తి వ్యయాలు కింది విధంగా ఉన్నాయి.

వ్యయం వివరాలు	2022-23	2023-24
కోకింగ్ కోల్	రూ.27,126 (42శాతం)	రూ.24,934 (41శాతం)
ఐరన్‌ఓర్	రూ.10,664 (17శాతం)	రూ.10,809 (18శాతం)
బాయిలర్ కోల్	రూ. 2,012 (3శాతం)	రూ.1,125 (2 శాతం)
ఫెర్రో అల్లాయిస్	రూ.1,130 (2శాతం)	రూ.1,339 (2శాతం)
అల్యూమినియం	రూ.2,954 (5శాతం)	రూ.2,506 (4శాతం)
ఉప ఉత్పత్తులు	- 455 (- 1శాతం)	రూ.526 (- 1శాతం)
మొత్తం ముడి పదార్థాలు	రూ.43,431 (68 శాతం)	రూ.40,276 (67 శాతం)
జీతాలు	రూ.6,857 (11 శాతం)	రూ.6,309 (10 శాతం)
కన్స్యూమబుల్స్	రూ.2,357 (4 శాతం)	రూ. 2,337 (4 శాతం)
ఆర్ అండ్ ఎం	రూ.1,474 (2 శాతం)	రూ.1,432 (2 శాతం)
విద్యుత్, నీరు	రూ.5053 (8 శాతం)	రూ.(4,196 (7 శాతం)
తరుగుదల	రూ.2,766 (4 శాతం)	రూ.2,568 (4 శాతం)
వడ్డీలు	రూ.3,911 (6 శాతం)	రూ.,4,314 (7శాతం)
మొత్తం వ్యయం	రూ.64,042 (100 శాతం)	రూ.60,401 (100 శాతం)

ఇళ్ల నిర్మాణం వేగవంతం

- 100 రోజుల ప్రణాళిక అమలు
- వారంలోగా లేఅవుట్‌లలో పనులు ప్రారంభం కావాలి
- గృహ నిర్మాణ సంస్థ అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ఇందుకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న 71 వేల ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికలో భాగంగా 4,109 ఇళ్లు స్లాబ్ లెవెల్‌కు చేర్చాలని, 11,450 ఇళ్లు నిర్మాణం పూర్తిచేయాలన్నారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో మాట్లాడి వారం రోజుల్లో లేఅవుట్‌లలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈనెల పదో తేదీ నుంచి రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, ఇసుక కోసం లేఅవుట్ల వారీగా ఇండెంట్ పెడితే సంబంధిత అధికారులకు చెబుతానన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ డి.అఖిల జిల్లాలో ఇళ్ల నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సీతారామ్, ఏఈ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- నగరం నుంచి చోడవరం మిల్లులకు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్
- నగరంలో మూడుచోట్ల పౌర సరఫరాల శాఖ దాడులు
- అక్కయ్యపాలెం డిపోపై కేసు నమోదు



అక్కయ్యపాలెం/మర్రిపాలెం, ఆగస్టు 2: నగరంలోని అక్కయ్యపాలెం నుంచి అనకాపల్లి జిల్లా చోడవరంలోని మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున ఎన్‌ఏడీ వద్ద ... మిగతా 6వ పేజీలో

ఏయూలో గోల్‌మాల్

గత నాలుగేళ్లుగా ఓఎంఆర్ షీట్, బుక్‌లెట్‌ల కొనుగోళ్లలో అక్రమాలు

- అస్మదీయులకు కాంట్రాక్టు
- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనంగా రూ.2 కోట్లు చెల్లింపు
- స్టేషనరీ, వైట్ పేపర్ వ్యవహారంలోనూ అదేతంతు
- తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌ను పక్కనపెట్టి నేరుగా వ్యవహారం
- ప్రస్తుత పాలకులు విచారణ జరిపించాలంటూ సర్వత్రా డిమాండ్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. గత పాలకులు వర్సిటీ నిధులను ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తాజాగా అటువంటి వ్యవహారం మరొకటి వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీలో ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేయించిన గత పాలకులు వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్స్, బుక్ లెట్స్‌ను బయట నుంచి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏటా వర్సిటీలో పరీక్షల నిర్వహణకు సుమారు 20 నుంచి 25 లక్షల వరకు ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు అవసరమవుతాయి. ఇందుకు వర్సిటీ రెండు కోట్ల నుంచి రూ.2.5 కోట్లు చెల్లిస్తుంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనంగా మరో రెండు కోట్ల రూపాయలు చెల్లించినట్టు తెలిసింది. ఓఎంఆర్ షీట్లు స్కానింగ్ చేయడంతోపాటు దానికి బుక్ లెట్ స్టిచింగ్ చేసినందుకు ఈ అదనపు మొత్తాన్ని చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ చెల్లింపు వెనుక పెద్ద తతంగమే నడిచింది. ఇదిలావుంటే ఈ ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్స్ సరఫరా చేసే కాంట్రాక్టును కూడా గత పాలకులు తమకు అస్మదీయులైన వారికి కట్టబెట్టినట్టు చెబుతున్నారు. గతంలో వర్సిటీలో ఉన్నతాధికారికి ఆత్మీయుడైన వ్యక్తికి ఈ కాంట్రాక్టును అప్పగించారు. దీనిపై ప్రస్తుత వీసీ పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

టెండర్ లేకుండా కొనుగోలు..

యూనివర్సిటీకి స్టేషనరీ, వైట్ పేపర్ సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తుంటారు. గత వీసీ బాధ్యతలు చేపట్టిన తరువాత 2020లో టెండర్ పిలిచారు. ఈ టెండర్‌లో గడిచిన 30 ఏళ్లుగా వర్సిటీకి స్టేషనరీ, తెల్ల కాగితాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్నారు. రూ.15 లక్షలు విలువజేసే పెన్నులు, జిరాక్స్ పేపర్లు వంటి స్టేషనరీ, మరో 180 టన్నులు వైట్ పేపర్ సరఫరా చేయడానికి కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, ఈ టెండర్‌ను పక్కనపెట్టిన వర్సిటీ అధికారులు తమకు కావాల్సిన వ్యక్తి నుంచి వీటిని నేరుగా కొనుగోలు చేశారు. అలాగే, పేపర్ వాల్యూయేషన్ సమయంలో ప్రొఫెసర్లకు క్లాత్ లైన్ కవర్లు ఇస్తుంటారు. ఏటా సుమారు 50 వేల వరకు క్లాత్ లైన్ కవర్లు అవసరం అవుతాయి. వీటిని కూడా టెండర్లు లేకుండానే నాటి అధికారులకు కావాల్సిన ... మిగతా 6వ పేజీలో



అక్రమ తవ్వకాలపై గనుల శాఖ కొరడా

ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలపై కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి షోకాజ్

- అనుమతులు లేకుండా 39,454.512 క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టి తవ్వినట్టు నిర్ధారణ
- ఎండాడలో అనుమతులు లేకుండా 'హయగ్రీవ' తవ్వకాలు
- రూ.5.43 కోట్లకు డిమాండ్ నోటీసు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన సొసైటీలు, సంస్థలపై గనుల శాఖ కొరడా ఝుళిపించింది. భీమిలి మండలం నేరేళ్లవలస సర్వే నంబర్ 118/5 ఎ (పాత సర్వే నంబరు 49/1)లో లేఅవుట్ చదును చేయడానికి భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అనుమతులు తీసుకోలేదని పేర్కొంటూ శుక్రవారం షోకాజ్ నోటీస్ జారీచేసింది.


సర్వే నంబర్ 118/5ఎలో గల 373.95 ఎకరాల్లో 278.95 ఎకరాలను చదును చేసే క్రమంలో ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలు జరిపినట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు లేఅవుట్ ప్రాంతం, ఎర్రమట్టి దిబ్బలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో లేఅవుట్ చదును, రోడ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి తవ్వకాలను సొసైటీ అనుమతి తీసుకోలేదని గనుల శాఖ నిర్ధారించింది. 75,874.062 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 0.52 మీటర్ల లోతున 39,454.512 క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టి తవ్వినట్టు గనుల శాఖ సర్వేలో తేలింది. దీనిపై సంబంధిత సొసైటీకి గనుల శాఖ నోటీస్ జారీచేసింది. నోటీస్ అందుకున్న 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని జిల్లా గనుల శాఖాధికారి డీఈ వీఎస్‌ఎన్ రాజు పేర్కొన్నారు. అలాగే ఎండాడ సర్వే నంబరు 92లో గల 12.5 ఎకరాల్లో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ విల్లాలు నిర్మించే క్రమంలో అనుమతి లేకుండా రాయి, గ్రావెల్ తవ్వకాలు చేసినట్టు... మిగతా 6వ పేజీలో

ఎర్రమట్టి దిబ్బల వద్ద తవ్వకాలు


వైద్యం అందించకుంటే ఆస్పత్రులపై చర్యలు

- ఆంధ్రజ్యోతితో 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు
- ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే నాకు ఫిర్యాదు చేయవచ్చు
- పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు
- జిల్లాలో నెట్‌వర్క్ పరిధిలో 105 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' పథకంలో చేరే రోగులకు మెరుగైన సేవలను అందించాలని ఆస్పత్రులను ఆదేశించినట్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కొద్దిరోజుల కిందట బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ పలు వివరాలను వెల్లడించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే...కార్డుదారులు తన దృష్టికి తీసుకువస్తే ఆయా ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టిసారించిందన్నారు. కేన్సర్ రోగులకు పథకంలో భాగంగా అందిస్తున్న మొత్తం సరిపోకపోతే మరో రూ.60 వేల వరకూ పెంచుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ విషయాన్ని రోగులు గుర్తించి ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చునని సూచించారు.


డాక్టర్ కొయ్యాన అప్పారావు

25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు

ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం కింద పొందే సేవలకు ప్రభుత్వం రూ.25 లక్షల వరకూ చెల్లిస్తుందని డాక్టర్ అప్పారావు తెలిపారు. ఒక కుటుంబం ఏడాదిలో రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యాన్ని పొందవచ్చునన్నారు. జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్‌లో 105 (45 ప్రభుత్వ, 38 ప్రైవేటు, 22 డెంటల్) ఆస్పత్రులు ఉన్నాయన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు సహకారాన్ని అందించేందుకు 85 మంది ఆరోగ్యమిత్రలు ఉన్నట్టు తెలిపారు. ఏవైనా ... మిగతా 6వ పేజీలో

విశాఖ క్రికెట్ జట్టుకు వీడీసీఏ అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న వీడీసీఏ ప్రతినిధులు, అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఆగస్టు 1: రాష్ట్ర స్థాయి అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న విశాఖ క్రికెట్ జట్టు ఆటగాళ్లతోపాటు కోచ్, మేనేజర్, సహాయ సిబ్బందిని విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) అభినందించింది. ఫైనల్స్‌లో కృష్ణా జట్టును 433 పరుగుల భారీ తేడాతో చిత్తు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్స్‌లో సెంచరీలు, అర్ధ సెంచరీతో రాణించిన వీసీహెచ్.శ్రావన్ (113), రోహన్ గణపతి (151 నాటౌట్), ఈశ్వర్ వర్ధన్ (87)తోపాటు బౌలింగ్‌లో ప్రతిభ చూపిన కె.భాను శ్రీహర్ష (ఆరు వికెట్లు), గౌతమ్ ఆర్య (నాలుగు వికెట్లు)లను అభినందించారు. ఏసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు పార్థసారథి, జేకేఎం రాజు పాల్గొన్నారు.

సావిత్రి క్లాసిక్స్ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, ఆగస్టు 2: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ చరిత్రకారులు సంజయ్‌కిషోర్ (హైదరాబాద్) సావిత్రి క్లాసిక్స్ పుస్తకం ఆవిష్కరణ, అభినందన సభ నిర్వహించారు. పుస్తక రచయిత మాట్లాడుతూ సినీ నటి సావిత్రి నటించిన పౌరాణికాలు, జానపద, సాంఘిక చిత్రాలు వేర్వేరు అధ్యాయాలుగా విభజించి ఈ పుస్తకంలో పొందుపరిచానన్నారు. ఈ పుస్తకాన్ని అతిథులు, నిర్వాక ప్రతినిధులు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిలిమ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, జాయింట్ సెక్రటరీ బి. చిన్నారావు, రంగ సాయి నాటక సంఘం అధ్యక్షుడు బాదంగీర్ సాయి, అక్కినేని నాటకోత్సవ సంఘం పొన్నాడ మోహనరావు, ఎండీ హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు మార్గదర్శకుడు బైపా అరుణ్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 2: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి జీవితాన్ని అంకితంచేసిన బైపా అరుణ్‌కుమార్ న్యాయవాదులకు మార్గదర్శకమని రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని బీఏకే ఛాంబర్స్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి న్యాయవాది వృత్తిలో కృషితో ఎదగాలన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఐ.ఎం.అహ్మద్, న్యాయవాదులు డా.టి.బోసుబాబు, జి.సుబ్బారావు, వి.చిన్నారావు, ఫసీయుద్దీన్, శారద, సంపత్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు. అరుణ్‌కుమార్‌ను సత్కరించారు.

కౌమారదశ సమస్యలపై జాగ్రత్తలు అవసరం


మాట్లాడుతున్న గైనకాలజిస్టు శిరీష

డాబాగార్డెన్స్, ఆగస్టు 2: కౌమారదశలోని విద్యార్థినులకు రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై తగిన జాగ్రత్తలు పాటించాలని గైనకాలజిస్టు డాక్టర్ కె.శిరిష అన్నారు. శుక్రవారం పాత జైలు రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అక్షయ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో జీవన విధాన విధానంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రిన్సిపాల్ విజయ, సీనియర్ లెక్చరర్ ఉదయశ్రీ, మాన్‌కైండ్ ఫార్మా సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి

మహారాణిపేట, ఆగస్టు 2: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణాను పూర్తి అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ కో ఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి 100 రోజుల్లో మాదక ద్రవ్యాలు, గంజాయిని పారదోలేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. వివిధ మార్గాల ద్వారా విశాఖకు గంజాయిని తరలిస్తున్నారని, వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసు కుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, విశ్వ విద్యాల యాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్ పకీరప్ప, అధికారులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రిలో చిల్లర దొంగతనాలు

- రోగుల సహాయకులను టార్గెట్ చేసి చోరీలు
- ఇటీవల రెండు బ్యాగులు మాయం
- పని చేయని సీసీ కెమెరాలు
- మందుబాబుల ఆగడాలతో వైద్యవర్గాల్లో ఆందోళన

జగదాంబ కూడలి, ఆగస్టు 2: ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రిలో దొంగల భయం నెలకొంది. గర్భిణులు, స్త్రీలకు సంబంధించి వైద్య చికిత్సల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడి వస్తుంటారు. వన్‌టౌన్ పరిసర ప్రాంతాల గర్భిణులు ప్రసవానికి ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. దీంతో నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల సహాయకులు విశ్రాంతి గదుల వద్ద ఆరుబయట తమ సామగ్రితో నిరీక్షిస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు విజృంభిస్తున్నారు. అందినకాడికి దోచుకుపోతున్నారు. అదమరిస్తే బ్యాగులు, సెల్ ఫోన్లు, నగదు మాయమవుతోందని వాపోతున్నారు. ఇటీవల రోగుల సహాయకుల కోసం ఏర్పాటుచేసిన విశ్రాంతి గది వద్ద ఉన్న రెండు బ్యాగులను క్షణాల్లో దొంగలుమాయం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా ఇక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకునే అవకాశం లేకుండా పోతోంది.

మందుబాబుల హల్‌చల్

దీనికి తోడు ఆస్పత్రి ఆవరణలో ఇటీవల మందుబాబులు సంచరిస్తున్నారు. మద్యం మత్తులో చిందులు తొక్కుతూ భయాందోళనకు గురిచేస్తున్నారు. ఇక్కడ అధికశాతం మహిళా వైద్యులే పనిచేస్తుంటారు. ప్రసవం కోసం చేరిన వారితో పాటు వారి సహాయకుల్లో ఆడవారే ఎక్కువమంది. రాత్రి సమయంలో బిడ్డలకు రక్షణ లేని పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఘోష ఆస్పత్రి, పనిచేయని సీసీ కెమెరాలు

పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలి



ఘోషా ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి. వన్‌టౌన్ పోలీసులు నైట్ రౌండ్స్ తిరగాలి. మందుబాబులు, దొంగల భయంతో వైద్య వర్గాలు, రోగులు, సహాయకులు భయంతో వణికిపోతున్నారు. గతంలో కంటే పోలీస్ పర్యవేక్షణ మరింత పెంచాల్సి ఉంది. ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలి.

\- డాక్టర్ ఉషాప్రసాద్, సూపరింటెండెంట్

తల్లి పాలు శిశువులకు శ్రేష్ఠం

అక్కయ్యపాలెం, ఆగస్టు 2: తల్లి పాలలో ఉన్న పోషక విలువలు శిశువుకు ఎంతో మేలు చేకూర్చుతాయని ఐసీడీఎస్ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. గ్రేటర్ 42వ వార్డు రెల్లివీధి రైల్వేన్యూకాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం ప్రపంచ తల్లి పాలవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ అందుకోసం గర్భిణులు, బాలింతలు 2-3 సంవత్సరాల వరకు పిల్లలకు తమ పాలివ్వాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.కుమారి, మెడికల్ ఆఫీసర్ హెచ్‌వీ వరలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆశాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, బేగం, పార్వతి, ఏఎన్‌ఎం ఆశ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



సీతమ్మధార, ఆగస్టు 2: రేసపువానిపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో ఆషాడమాస పూజల్లో భాగంగా అమ్మవారిని శాకంబరి గా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గురునాథరెడ్డి, సెక్రటరీ బాచీ, ఈశ్వరరావు, అర్జునరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న జనసేన నార్త్ కన్వీనర్ ఉషాకిరణ్

మద్రిపాలెం, ఆగస్టు 2: జనసేన పార్టీ సభ్యత్వ నమోదును గ్రేటర్ పరిధి 54వ వార్డులో విస్తృతంగా చేపడుతున్నారు. వార్డు అధ్యక్షుడు వింజమూరి భాస్కర్ అధ్వర్యంలో శుక్రవారం మద్రిపాలెంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉత్తర ని యోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొన్నారు. స్వచ్ఛందంగా వచ్చినవారికి సభ్యత్వ నమోదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ విధివిధానాలు, పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా పార్టీ చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నరన్నారు. సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు పరిహారం పొందేలా పార్టీ చర్యలు చేపట్టి నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు కడిమి సీతారాం, దోగ్గా సురేంద్ర సంతోష్, మంజుల, గౌరి, రాము, పూడి గణేష్, లక్ష్మి, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

బొత్స ఎంపికపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆశావాహులు ఎంతోమంది...

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వైసీపీలో అనేక మంది సీనియర్ నాయకులు ఉన్నారు. తాజా మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌లు ఈ ఎమ్మెల్సీ సీటును బలంగా కోరుకున్నారు. అలాగే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పోటీ చూసి ఊహించని విధంగా క్రాస్ ఓటింగ్ వల్ల ఓడిపోయిన మత్స్యకార నాయకుడు కోలా గురువులు కూడా ఈ సీటు తనకే వస్తుందని భావించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలో కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌టీ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యానారాయణరాజు, గాజువాక నియోజక వర్గంలో చింతలపూడి వెంకట్రామయ్య, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కేకే రాజు...ఇలా పార్టీలో చాలా మంది ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. కానీ వీరందరినీ కాదని పక్క జిల్లా విజయనగరానికి చెందిన బొత్సను తీసుకువచ్చి అభ్యర్థిగా ప్రకటించారు. ఇది విశాఖ జిల్లా నాయకులను అవమానించినట్టేనని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విజయనగరం జిల్లాలో పదవులన్నీ బొత్స కుటుంబానికే కట్టబెట్టారని, పార్టీ ఓడిపోయిన తరువాత కూడా ఆ కుటుంబం హవానే సాగాలనే ధోరణి అధిష్ఠానంలో కనిపిస్తున్నదని, అయితే అది ఆ జిల్లాకే పరిమితమైతే బాగుండేదని, పొరుగు జిల్లాకు తీసుకువచ్చి ఆయన నాయకత్వాన్ని రుద్దడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది పార్టీ అభ్యర్థి విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే.

నష్టాల్లో కూరుకుపోతున్న ఉక్కు

... 5వ పేజీ తరువాయి

ధరలో టన్నుకు రూ.5 వేల రూపాయల వ్యత్యాసం ఉంటోంది. అదే లాభాలపై ప్రభావం చూపుతోంది.

అత్యవసరం పేరుతో టన్ను రూ.14 వేలు చొప్పున కొనుగోళ్లు

విశాఖ స్టీల్‌కి ఐరన్‌ఓర్‌ను ఎన్‌ఎండీసీ సరఫరా చేస్తోంది. ఇటీవల కాలం ఓర్ ఇవ్వడానికి ఇబ్బంది పెడుతోంది. ప్రైవేటు కంపెనీలకు అమ్ముతోంది. డిమాండ్‌కు తగినంత ఇవ్వడం లేదు. దాంతో అత్యవసరమై బయట కొనాల్సి వస్తోంది. ఎన్‌ఎండీసీ నుంచి టన్ను రూ.10 వేలకు రావలసి ఉండగా, అదే సరకు దాని కంటే నాణ్యత తక్కువ ఉన్నదానిని మార్కెట్‌లో టన్ను రూ.14 వేలు చొప్పున కొంటున్నారు. దీంతో నష్టాలు ఎక్కువవుతున్నాయి. ఇక్కడే కొనుగోలు అధికారం ఉన్న అధికారులు చేతివాటం చూపుతున్నారు. కమీషన్లు ఎక్కువ ఇచ్చిన వారి దగ్గరే కొని సొంత లాభం చూసుకుంటున్నారు. అన్ని రకాల ముడి పదార్థాలందించి, పూర్తిస్థాయిలో ప్లాంటు నడిపితేనే విశాఖ స్టీల్ పరిస్థితి మెరుగుపడుతుంది. ఎంత ఉత్పత్తి చేసినా స్థిర వ్యయాలు (32 శాతం) ఒక విధంగానే ఉంటాయి. మూడు బ్లాస్ ఫర్నేసులు పనిచేసినా అదే వ్యయం, రెండు పనిచేసినా అదే వ్యయం. కొంత కాలంగా రెండు బీఎఫ్‌లు మాత్రమే పనిచేయడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, నష్టాలు వస్తున్నాయి.

ఐరన్‌ఓర్‌కు వెచ్చిస్తున్న మొత్తం టన్నుకు ఇలా ఉంది.

ఏడాది	విశాఖ ఉక్కు	సెయిల్	వ్యత్యాసం
2017-18	రూ.6,584	రూ.2,396	రూ.4,188
2018-19	రూ.7,869	రూ.2,909	రూ.4,960
2019-20	రూ.7,494	రూ.2,977	రూ.4,517
2020-21	రూ.8,738	రూ.3,147	రూ.5,591
2021-22	రూ.12,493	రూ.5,012	రూ.7,481
2022-23	రూ.9,346	రూ.4571	రూ.4,775



కళాశాలను సందర్శించాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం


విష్ణుకుమార్ రాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కె.వి.రమణ

కంచరపాలెం, ఆగస్టు 2: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించాలని ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును కలిసి ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ శుక్రవారం కోరారు. సీనియర్ అధ్యాపకులు డా.బీవీ లక్ష్మణరావుతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కళాశాలకు ఢిల్లీ వారు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ మంజూరు చేసిన సందర్భంగా కళాశాలను సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి

సీతమ్మధార: గత వైసీపీ ప్రభుత్వం అసంబద్ధ వైఖరితో అన్యాయానికి లోనైన గ్రూప్1, గ్రూప్-2 పరీక్షల అభ్యరులకు న్యాయం కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్‌కుమార్ వినతి పత్రం అందచేశారు. జాబ్ క్యాలెండర్‌కు సంబంధించిన అన్ని ప్రభుత్వ అకాడమీ పుస్తకాలను అందుబాటులోకి తేవాలని, విశ్వవిద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం చేపట్టాలని, ఉద్యోగ వయోపరిమితి 47కు పెంచాలని కోరారు. చట్టసభలో నిరుద్యోగ యువతకు స్థానం కల్పిస్తే వారి సమస్యలు వారే నేరుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని వన్‌టౌన్‌లో వివేకానంద స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టరు సీఎంఈ జహీర్ అహ్మద్ నేతృత్వంలో 100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. సంస్థ కార్యాలయంనుంచి పాత పోస్టాఫీసు మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు. జాతికి చేసిన సేవలపాటు ఆయన రూపొందిచిన జాతీయ జెండా విశిష్టతకు భావితరాలకు తెలియజేయాలని ఈ ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మక్సూద్ అహ్మద్ పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పింగళి వెంకయ్య వర్ధంతి 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి చి త్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

అక్రమ తవ్వకాలపై గనుల శాఖ కొరడా

... 5వ పేజీ తరువాయి

గనుల శాఖ సర్వేలో తేలింది. దీనిపై గత నెలలో సర్వే నిర్వహించి 52,692 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, 22,582 క్యూబిక్ మీటర్ల రాయి మొత్తం 75,274 క్యూబిక్ మీటర్లు తవ్వినట్టు నిర్ధారించింది. దీంట్లో కొంత గ్రావెల్ సమీపంలో ఒకచోట నిల్వ చేసినట్టు గుర్తించారు. దీనిపై గత నెల 18వ తేదీన హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ యజమాని జగదీశ్వరుడుకు జీపీఏగా ఉన్న గన్నమని వెంకటేశ్వరరావుకు షోకాజ్ ఇచ్చి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నోటీసుకు గన్నమని వెంకటేశ్వరరావు వివరణపై సంతృప్తి చెందని గనుల శాఖ, రూ.5,43,394.37 జరిమానా చెల్లించాలని శుక్రవారం డిమాండ్ నోటీస్ జారీచేసింది. గనుల శాఖ నిబంధనల మేరకు 75,274 క్యూబిక్ మీటర్లకు రూ.44,03,520 వసూలు చేయాలి. కానీ అనుమతి లేనందున చెల్లించాల్సిన మొత్తంపై పదింతలు వసూలుచేస్తారు. దీనికి పలు రకాల పన్నులు అదనం. వెరసి రూ.5.43 కోట్లు చెల్లించాలని తాజాగా నోటీస్ జారీచేశారు. కాగా సిరిపురంలో సీబీసీఎన్‌సీ స్థలంలో తవ్వకాలకు సంబంధించి మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సుమారు రెండు కోట్లకు డిమాండ్ నోటీస్ ఇచ్చిన విషయం తెలిసిందే.



4న వైసీపీ నేతల భూ కబ్జాలపై మదనపల్లెలో సదస్సు



మాట్లాడుతున్న రామకృష్ణ

జ్ఞానాపురం, ఆగస్టు 2: వైసీపీ నాయకుల భూ కబ్జాలపై ఈ నెల 4వ తేదీన మదనపల్లెలో సదస్సు ని ర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. నగరంలో గురువారం నిర్వహించిన జిల్లా పార్టీ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో ఆయన తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. మదనపల్లెలో ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే రెవెన్యూ రికార్డులను తగలబెట్టారని, దీనికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని కుంటి సాకు చేప్పే ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ వైసీపీ నా యకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో నియంత మాదిరిగా జగన్ పరిపాలన సాగించారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, నాయకులుసత్యనారాయణ, ఎ.విమల, మన్మధరావు పాల్గొన్నారు.

నేవల్ ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్‌షాప్

విశాఖపట్నం, ఆగస్టు 2: నేవల్ ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశంపై శుక్రవారం ఐఎన్‌ఎస్ డేగాలో వర్క్‌షాప్ జరిగింది. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహనరాజు ఏవియేషన్ ప్రణాళికలు, డిజైనింగ్, కన్‌స్ట్రక్షన్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డెలిగేట్లు ఐఎన్‌ఎస్ డేగాలోని ఎయిర్‌ఫీల్డ్ ప్రాజెక్టును సందర్శించారు.

వీఎంఆర్‌డీఏలో 100 రోజుల ప్రణాళిక

- అధికారుల కసరత్తు..అభివృద్ధి పనుల పూర్తికి యత్నం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు రావడంతో రాబోయే వంద రోజుల్లో చేయబోయే పనులపై ప్రతి శాఖ ఒక ప్రణాళిక రూపొందించుకుంటోంది. వంద రోజుల పరిపాలన పూర్తి అయ్యేసరికి ఏమి చేశామో ప్రజలకు వివరించడానికి ఇది ఉపయోగపడుతుందని ప్రభుత్వ పెద్దల ఆలోచన. అందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని శాఖలు, ముఖ్య అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించింది. ఈ మేరకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో కూడా 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కొత్త పనులు చేపట్టే అవకాశం లేకపోవడం వల్ల ప్రస్తుతం జరుగుతున్న పనులనే వంద రోజుల్లో పూర్తిచేసేలా ప్లాన్ తయారు చేసుకొని, దానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేయాలని భావిస్తున్నారు. కమిషనర్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, అకౌంట్స్, ఎస్టేట్, అర్బన్ ఫారెస్ట్ విభాగాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. త్వరగా పూర్తిచేయడానికి అవకాశం ఉన్న రహదారులు, ఇప్పటికే చేపట్టి పూర్తి కావలసిన ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి, ప్లాట్ల విక్రయాలు, లేఅవుట్ల క్లియరెన్స్, వివిధ వాణిజ్య సముదాయాల నుంచి రావలసిన అద్దెల వసూళ్లు, ప్రభుత్వం నుంచి రావలసిన భూముల వ్యవహారాలు, ఇలా అన్నింటిని ప్రాధాన్య క్రమంలో పెట్టుకొని, వాటిని సమీక్షించుకుంటూ వంద రోజుల్లో పూర్తిచేసి ప్రగతిని చూపించాలని యోచిస్తున్నారు. ఈ ప్రణాళిక మూడు, నాలుగు రోజుల్లో ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఏయూలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. గతనాలుగేళ్లుగా వీటిని టెండర్లు లేకుండానే కొనుగోలు చేస్తుండడంవెనుకున్న మర్మంపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ ఎందుకు మూసివేసినట్టో..?

ఏయూలో ఏళ్ల తరబడి ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను గత పాలకులు మూసివేశారు. దీనికి గల కారణాలను అప్పట్లో చెప్పలేదు. పరికరాలు పాడయ్యాయని, కొనుగోలు చేసేందుకు పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తుందన్న కారణాలను చూపించారు. సుమారు 60 ఏళ్లకు పైబడి చరిత్ర కలిగిన ఈ ప్రెస్‌లోనే వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు, దూర విద్యకు సంబంధించి మెటీరియల్‌ను ప్రింట్ చేసేవారు. కానీ, సాంకేతిక ఇబ్బందులు, ఖర్చు పెరుగుతోందన్న కారణాన్ని చూపించి ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేశారు. ఆ తరువాత తమకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు అప్పగించుకుని ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు. ఈ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేసిన తరువాత ఇక్కడ పనిచేసే సుమారు 18 మంది టెక్నికల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో నాన్ టెక్నికల్ సేవల్లో వినియోగించుకుంటున్నారు.

క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి: కలెక్టర్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు సంభవించిన సందర్భంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించి కాపాడాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు గాయపడితే ఆరోగ్యశ్రీ ద్వారా నగదు రహిత చికిత్స అందించాలని సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గ్రిల్స్, మరమ్మతులు నెలరోజుల్లో పూర్తిచేయాలన్నారు. జాతీయరహదారులపై సైన్‌బోర్డులు, వేగ పరిమితులు తెలిసేలా నెలాఖరులోగా బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులతోపాటు వెనుక ఉన్న వ్యక్తులు కూడా విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ సందర్భంగా సంగం శరత్ థియేటర్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించిన గుడ్ సమారిటన్‌లు వై.రాజు, రావి వెంకటరావుకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున పారితోషికం అందజేశారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జాయింట్ సీపీ ఫకీరప్ప, రవాణాశాఖ అధికారి రాజారత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీకి సేవలందించిన వారికి గుర్తింపు: గండి బాబ్జీ

మహారాణిపేట, ఆగస్టు 2: తెలుగు దేశం పార్టీకి సేవలందించిన న్యాయ వాదు లను గుర్తించి తగిన పదవులతో వారిని గౌరవిస్తామని ఆ పార్టీ జిల్లా గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విశాఖ నగరంలోని న్యాయ వాదులు వివిధ విభాగాల నామినేటెడ్ పదవులను ఆశిస్తూ బాబ్జీకి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు బి. రాజశేఖర్, గొంప సత్య నారాయణ, భరత్ వేణు, సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, అప్పలనాయుడు, సతీష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెంలో రేషన్ డిపోల్లో నిల్వ చేసిన బియ్యాన్ని మూడు ఆటోల్లో చోడవరం తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని డిపో నంబరు-2పై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి రిజిస్టర్‌లో పేర్కొన్న సరకు కంటే 274 కిలోలు అదనంగా ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో డిపోకు కేటాయించిన సరకు మొత్తం సీజ్ చేసి డిపో నంబరు-3కు అప్పగించారు. డిపో నంబరు-2పై 6-ఎ కేసు నమోదుచేశారు. కాగా పరదేశిపాలెం, రైల్వేన్యూ కాలనీలో వేర్వేరుగా దాడులు చేసి 970 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో అక్రమంగా బియ్యం వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు హెచ్చరించారు.

వైద్యం అందించకుంటే ఆస్పత్రులపై చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులుంటే మిత్రలు దృష్టికి తీసుకు వెళ్లవచ్చునన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే తనకు (నంబర్ 9281068145)కు ఫిర్యాదు చేయాలన్నారు. నెట్ వర్క్ ఆస్పత్రుల్లో రోజుకు కనీసం వేయి మంది వరకు కొత్తగా చేరుతున్నారన్నారు. తాను ప్రతిరోజూ ఒక ఆస్పత్రిని తనిఖీ చేస్తున్నట్టు వెల్లడించారు. రోగులతో మాట్లాడి ఇబ్బం దులను తెలుసుకుంటున్నట్టు వెల్లడించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అదనంగా డబ్బులు అడుగుతున్నారని చెబుతున్నారని, వెంటనే చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఎల్‌వీనగర్‌లో తిష్ఠ వేసిన సమస్యలు

» మరమ్మతులకు నోచని రోడ్లు, డ్రైనేజీలు
» రాకపోకలకు స్థానికుల అవస్థలు

ఆటోనగర్, ఆగస్టు 2: జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో ప్రధాన రహదారులు, డ్రైనేజీ కాలువలు మరమ్మతులకు గురవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిలో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు, రాళ్లు తేలి ఉండడంతో వాహనచోదకులు, పాదచారుల పాట్లు వర్ణనాతీతం. వృద్ధులు, చిన్నారులు, ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరీ కష్టంగా మారుతోంది. ఏళ్లు గడుస్తున్నా రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ కాలనీలో వేలాది మంది నివసిస్తున్నారు. కల్యాణ మండపాలు, స్కూళ్లు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటోంది. దీనికి తోడు ఆక్రమణలతో కుచించుకుపోతోంది. భారీ వాహనాలు, మినీ వ్యానులు, ఆటోలు, వివిధ స్కూలు బస్సుల రాకపోకలు అధికమవుతున్నాయి. యూజీడీ పైప్‌లైన్ల కోసం తవ్విన గోతుల పూడ్చివేతలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో రహదారులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులు ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరడంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలువల నిర్మాణం సక్రమంగా లేక ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. ముందుకు సాగక నిల్వ ఉంటుండడతో తీవ్ర దుర్గంధం, దోమలు వ్యాప్తి చెంది దీర్ఘకాల రోగాలు సంక్రమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జనావాస ప్రాంతంపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా రహదారులను ఆధునికీకరించి, డ్రైనేజీలను కొత్తగా నిర్మించి, సమస్యలను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


ఎల్‌వీనగర్‌లో శిథిల స్థితికి చేరిన రహదారి


అధ్వాన స్థితిలో మురుగు కాలువ

తహసీల్దారుకు నేతల అభినందనలు


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పెదగంట్యాడ, ఆగస్టు 2: పెదగంట్యాడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన రామారావును జీవీఎంసీ 77వ వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు శుక్రవారం కలిసి అభినందించారు. జనసేన నేత మహేష్ టీడీపీ, బీజేపీ నాయకులు వార్డుపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉక్కు రిలే దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 2: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న ఉద్యమంలో భాగంగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రకటించారు. యూనియన్ల ఆధ్వర్యంలో దీక్షల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 3, 7, 13, 19, 22, 30 తేదీల్లో సీఐటీయూ, 5, 10, 15, 20, 23, 31తేదీల్లో ఏఐటీయూసీ, 6, 12, 17, 21, 26 తేదీల్లో ఇంటక్, 4న కాంట్రాక్టు కార్మికులు (ఏఐటీయూసీ), 7 వైఎస్సార్‌టీయూసీ, 9, 29న యూజ్, డీఐటీయూ, వీఎస్‌ఈయు, వీఎస్‌పీఈయూ, 11న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 14న ఓబీసీ అసోసియేషన్, 16న డీఎస్‌ఈయూ, 18న టీఎన్‌టీయూసీ, 24న సీఎఫ్‌టీయూఐ., 25న కాంట్రాక్టు కార్మికులు (హెచ్‌ఎంఎస్), 27 జేఎంఎస్, 28న టీఎన్‌టీయూసీ యూనియన్‌ల వారీగా దీక్షలు చేపట్టనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, ఆగస్టు 2: పద్మనాభపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్టు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. బంటాకాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పల నర్సయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ తదితర పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన

కూర్మన్నపాలెం, ఆగస్టు 2: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు రాకుండా యజమానులు తగిన జాగ్రత్తలను పాటించాలని అగనంపూడి పశు వైద్య కేంద్రం వైద్యాధికారి పి.లావణ్య అన్నారు.శివాజీనగర్‌లో స్నేహాంజలి గ్రూపు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్య నారాయణ సభ్యులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


రాంనగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 2: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగిఉండాలని గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. రాంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే-ఫ్రైడేలో భాగంగా తడి పొడి చెత్తతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు డి. శ్రీనివాసరావు, ఎల్.వి. లక్ష్మి, కొత్తర అప్పలరాజు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: తిరుమలనగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఇళ్ల ఆవరణల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలన్నారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేశారు.

రక్షణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



డాక్‌యార్డు ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

మల్కాపురం, ఆగస్టు 2: విశాఖ రక్షణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి డిఫెన్స్ కో-ఆర్డినేషన్ ఇచ్చిన పిలుపుమేరకు కార్మికులు శుక్రవారం ఉదయం డాక్‌యార్డు విజయనగర్ గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ, ఎనిమిదో వేతన సంఘంను వెంటనే నియమించాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలోని ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని కోరారు. అలాగే ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధిలో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని, రక్షణ, రైల్వే, పబ్లిక్ సెక్టార్‌లను ప్రైవేటు పరం చేయరాదని, లేబర్స్ కోడ్‌ను రద్దుచేయాలని, డీఏ బకాయి వెంటనే చెల్లించాలని, కారుణ్య నియమకాలపై ఐదుశాతం పరిమితిని ఎత్తివేసి అందరికీ అవకాశం కల్పించాలన్నారు.సంప్రదింపుల కమిటీ సమావేశాలను రెగ్యులర్‌గా జరపాలని, రద్దు చేసిన యూనియన్‌లకు తిరిగి గుర్తింపు ఇవ్వాలనే డిమాండ్ చేశారు. విశాఖపట్నం రక్షణ రంగంలో పనిచేసే కార్మికులకు అన్ని అలవెన్సులు కలుపుకొని అదనపు పని గంటలు (ఓటీ)చెల్లించే విషయంలో తీవ్ర వివక్ష కొనసాగుతోందని ఆ వేదన వ్యక్తం చేశారు. రక్షణ రంగం అధికారులు కార్మిక రంగానికి న్యాయం చేయాలని కోరారు.

ఉక్కులో ముడిసరకు సమస్యను తీర్చాలి

» ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్


రిలే నిరాహార దీక్షల శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, ఆగస్టు 2: స్టీల్ ప్లాంట్‌లో రా మెటీరియల్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో పాల్గొన్న ఇంటక్ కార్మికుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికులు చిత్తశుద్ధితో 100 శాతం ఉత్పత్తిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిచేలా చర్యలు చేపట్టాల కోరారు. ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ముడి సరకు, నిధుల కొరతపై ఎంపీ శ్రీభరత్‌కు లేఖ రాశామన్నారు. సమయానికి జీతాలు ఇవ్వక కార్మికులు, కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 2: ప్రసార మాధ్యమాల్లో కృత్రిమ ఆహార పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లి పాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పెందుర్తి శిశు సంరక్షణ విభాగ అధికారి నీలవేణి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకత, బాలికల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక లైఫ్ సైన్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన పలు కళా రూపాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రుక్సానా బేగం, పి. దుర్గాబాయి, సీతాలక్ష్మి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజం కావాలి

పెదగంట్యాడ: ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. పెదగంట్యాడ, గంగవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన తల్లిపాలవారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అవసరమన్నారు. కార్యకర్తలు శ్రీరం దుర్గమ్మ, పడాల శాంతి, విజయలక్ష్మి, ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

తెలుగు జాతి ఖ్యాతిని పెంచిన పింగళి


పింగళి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

అగనంపూడి, ఆగస్టు 2: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలను స్థానిక సత్రం జంక్షన్‌లోని మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పింగళి చిత్ర పటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ పతాక రూపకర్తగానే కాకుండా, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పింగళి దేశానికి సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయం కమిటీ ప్రతినిధి కరణం పైడిరాజు, నాయకులు దుల్ల చెల్లారావు, సింగిడి సింహాచలం, తలారి శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిరూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్.ఎం. కాళ్ల గుణేశ్వరరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాలను కలిసిన సీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 2: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం ప్రతినిధులు కోరారు. అనకాపల్లిలో శుక్రవారం ఎమ్మెల్యేని కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఆర్థికంగా సహాయం చేయాలని, పూర్తి సామర్థ్యంతో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ప్లాంట్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ.ప్రసాద్, సభ్యులు సత్యనారాయణ తదితరులున్నారు.

డ్రైవర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గాజువాక, ఆగస్టు 2: గాజువాక డ్రైవర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడ్డారు. అయితే ఆ ఇంట్లో విలువైన వస్తువులు లేవని, ఏవీ అపహరణకు గురికాలేదని ఇంటి యజమాని పోలీసులకు తెలిపాడు. డ్రైవర్స్ కాలనీ ప్రాంతానికి చెందిన మోహన్‌రావు మూడు నెలల క్రితం కుటుంబంతో సహా అమెరికాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లాడు. అయితే ఇంట్లో విలువైన సామగ్రి ఉంచలేదు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు విరగొట్టి ఉండడంతో చుట్టు పక్కల వారు సమాచారాన్ని యజమాని మోహన్‌రావుకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే ఇంట్లో విలువైన వస్తువులు అపరహణకు గురికాకపోయినప్పటికీ దొంగతనాల విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం'

గాజువాక, ఆగస్టు 2: ఎస్సీల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎన్నో ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ పోరాడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ చొరవ, ఎన్డీఏ కూటమి నాయకుల సహకారంతో ఉద్యమానికి ఫలితం దక్కిందన్నారు. రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని కోర్టు సూచించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ప్రకాష్, ఈశ్వరరావు, పెంటారావు, వంశీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పెదగంట్యాడలో ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు


మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

పెదగంట్యాడ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో పెదగంట్యాడలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ దండోరా నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక జంక్షన్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎం.పెంటయ్య, పి.సోమునాయుడు, టి.పెంటయ్య, ఎం.ప్రకాష్, కె.సన్యాసమ్మ, కూటమి నేతలు కోన చినఅప్పారావు, శ్రీ ముసిరి శ్రీనివాసరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఆగస్టు 2: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరసర గ్రా మాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని వసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్స్‌కాలనీ, అగనంపూడిలో దుర్గమ్మకు అలంకరణ

శాకంబరిగా పద్మావతీ అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: ఆషాఢ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని బాలాజీ దివ్యక్షేత్రంలోని పద్మావతి అమ్మవారు శాకంబరి మాతగా భక్తులకు దర్శన మిచ్చారు. సుమారు 18 రకాల కూరగాయలతో అమ్మవారిని ఆలయఅర్చకులు అలంకరించి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. దివ్యక్షేత్రం పాలకమండలి సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: రాజులపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆషాఢమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ భగవత్ రామానుజుల స్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 70వ వార్డు డ్రైవర్సు కాలనీ, ఎల్‌వీ నగర్‌లలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రధాన అర్చకులు సోమేశ్వర శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.


ఎస్టీబీఎల్‌లో శాకంబరిగా పద్మావతీ దేవి


రామానుజుల విగ్రహానికి పంచామృతాభిషేకం

సినిమా గైడ్

● **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
● **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
● **కల్కి:** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 62, అల్లం 150, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో)75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ 23, బీన్స్(పెన్సిల్) 80, పొటల్స్ 30, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 80
ఫారం ధర	-- 100
విత్ స్కిన్	-- 170
స్కిన్‌లెస్	-- 180

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

చింతాలమ్మకు ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న పల్లా తదితరులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 2: తుంగ్లాం కాలనీలోని చింతాలమ్మ అమ్మవారి ఆలయానికి శుక్రవారం విచ్చేసిన టీడీటీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కంచిపాటి ప్రకాష్, పి.రాజు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం: ఎమ్మెల్యే గణబాబు


మల్కాపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, ఆగస్టు 2: సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఆదేశించారు. గ్రేటర్ 61వ వార్డులో శుక్రవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గాంధీజీవీధి, నగరాల వీధి, జాలరివీధి, మార్కెట్ ప్రాంతాలలో సమస్యలను గుర్తించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం కూడదన్నారు. ప్రభుత్వ పథకాల కోసం వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, నూకరాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై తహసీల్దార్ పరిశీలన


ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

పెందుర్తి, ఆగస్టు 2: సుజాతనగర్‌లోని చెరువు ఆక్రమణపై రెవెన్యూ శాఖ విచారణ చేపట్టింది. చెరువు కబ్జాపై జూన్ 21న 'ఆంధ్రజ్యోతి'లో 'రాజు చెరువుకు ఎసరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో శుక్రవారం ఇక్కడి చెరువు ప్రాంతాన్ని తహసీల్దార్ వేణుగోపాల్ సందర్శించారు. ఆక్రమణలను పరిశీలించారు. పాకలు, షెడ్లులు, పక్కా నిర్మాణాలపై సమీక్షించారు. విలేజ్ రెవెన్యూ మ్యాపింగ్ (వీఆర్ఎం) ఆధారంగా ఎఫ్ఎంబీ స్కెచ్‌ను పరిశీలించి చెరువు సరిహద్దులను గుర్తించాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో తెలియజేయాలని కోరారు.

PUBLIC NOTICE / ప్రకటన

This Public Notice is being issued under the instructions of my client **Sri. Thalluri Purna Chandra Rao.** Public are hereby informed that the below schedule property was the subject matter in **OS No. 27/1975** which was a Suit for Partition between Sri Ethalapaka Guruvulu Vs. Sri Ethalapaka China Ammoru and others. In this Suit the Hon'ble Second Additional District Judge, Visakhapatnam vide Orders in **IA 509/1979** passed a Final Decree. Subsequently the same was engrossed on the requisite Non Judicial Stamps also. By virtue of the said Final Decree families of Sri Ethalapaka Peda Appa Rao S/o. Sri Ammoru, Sri Guruvulu, Sri China Appa Rao and Sri Poli Raju got their respective shares which were also demarcated in a plan appended to the Final Decree engrossed on the Stamp Papers.

By virtue of Registered Sale Deed dated 30.08.2014 bearing **Doc. No. 3337/2014** followed by Rectification Deed dated 09.10.2014 bearing **Doc. No. 3725/2014,** My client purchased site of an extent of 597 Sq. yards out of the Suit Schedule property referred above from the legal heirs of Sri Eethalapaka China Appa Rao and others which came to the share of Sri Eethalapaka China Appa Rao vide the Final Decree referred above.

The legal heirs of other share holders i.e., Sri Eethalapaka China Ammoru and Sri Eethalapaka Peda Appa Rao have also entered into Agreements of Sale with my client to sell their respective shares of site in an extent of 400 Sq. yards and 380 Sq. yards respectively.

My client has been in possession of the property purchased by him through the Registered Sale Deed referred above. On the request of the land owners my client is also protecting the remaining site. Vide Registered Sale Deed dated 29.07.2016 my client sold the site purchased by him to Sri B.S.B. Prabhakar Rao who requested my client to continue to protect the site.

I submit that the total extent of the site is 1600 Sq. yards only on land through as per Decree it is 2165 Sq. yards.

Out of the property covered by the Decree referred above the family members of Sri Guruvulu sold away their share of 324 Sq. yards. Hence they have no further share in the property covered by the Final Decree. My client learnt that concealing all these facts some of the family members of Sri Guruvulu i.e., Sri Madhusudhan and Sri Sudhakar sons of Sri Ramachandra Rao are offering the remaining property for sale over which they have no rights whatsoever. It is also learnt that some third parties are also trying to lay some baseless claim over the property and also misrepresenting the Survey Number as T.S. No. 680/1 instead of 685/1.

Therefore the Public are hereby cautioned except my client and the remaining share holders who agreed to sell the property to my client no one has got any right whatsoever over the below schedule property and if any member of the public deals with the property with any person other than my clients they will be doing so at their risk and costs and will also be liable for all the actions that will be initiated by my clients.

SCHEDULE

Site on ground in an extent of 1600 Sq. yards (as per Decree 2165 Sq. yards) in Plot Nos. 17, 18 and 23 in T.P. No. 24/64 in T.S. No. 685/1, Srinagar, Allipuram Ward, in the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded by:

East : Land sold by Peda Appa Rao previously and Plot No. 24
South : Market Road
West : Gedda
North : 40 Feet Road

SRINIVAS AJJARAPU, ADVOCATE
D. No. 29-2-39, Opp. District Court,
Visakhapatnam. Ph : **9848192978**

విశాఖ క్రికెట్ జట్టుకు వీడీసీఏ అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న వీడీసీఏ ప్రతినిధులు, అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 1: రాష్ట్ర స్థాయి అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న విశాఖ క్రికెట్ జట్టు ఆటగాళ్లతోపాటు కోచ్, మేనేజర్, సహాయ సిబ్బందిని విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) అభినందించింది. ఫైనల్స్‌లో కృష్ణా జట్టును 433 పరుగుల భారీ తేడాతో చిత్తు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్స్‌లో సెంచరీలు, అర్ధ సెంచరీతో రాణించిన వీసీహెచ్.శ్రావన్ (113), రోహన్ గణపతి (151 నాటౌట్), ఈశ్వర్ వర్ధన్ (87)తోపాటు బౌలింగ్‌లో ప్రతిభ చూపిన కె.భాను శ్రీహర్ష (ఆరు వికెట్లు), గౌతమ్ ఆర్య (నాలుగు వికెట్లు)లను అభినందించారు. ఏసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు పార్థసారధి, జేకేఎం రాజు పాల్గొన్నారు.

సావిత్రి క్లాసిక్స్ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, ఆగస్టు 2: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిలిమ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ చరిత్రకారులు సంజయ్‌కిషోర్ (హైదరాబాద్) సావిత్రి క్లాసిక్స్ పుస్తకం ఆవిష్కరణ, అభినందన సభ నిర్వహించారు. పుస్తక రచయిత మాట్లాడుతూ సినీ నటి సావిత్రి నటించిన పౌరాణికాలు, జానపద, సాంఘిక చిత్రాలు వేర్వేరు అధ్యాయాలుగా విభజించి ఈ పుస్తకంలో పొందుపరిచానన్నారు. ఈ పుస్తకాన్ని అతిథులు, నిర్వాక ప్రతినిధులు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిలిమ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, జాయింట్ సెక్రటరీ బి. చిన్నారావు, రంగ సాయి నాటక సంఘం అధ్యక్షుడు బాదంగీర్ సాయి, అక్కినేని నాటకోత్సవ సంఘం పొన్నాడ మోహనరావు, ఎండీ హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు మార్గదర్శకుడు బైపా అరుణ్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 2: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి జీవితాన్ని అంకితంచేసిన బైపా అరుణ్‌కుమార్ న్యాయవాదులకు మార్గదర్శకమని రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని బీపీకే ఛాంబర్స్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి న్యాయవాది వృత్తిలో కృషితో ఎదగాలన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఐ.ఎం.అహ్మద్, న్యాయవాదులు డా.టి.బోసుబాబు, జి.సుబ్బారావు, వి.చిన్నారావు, ఫసీయుద్దీన్, శారద, సంపత్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు. అరుణ్‌కుమార్‌ను సత్కరించారు.

కౌమారదశ సమస్యలపై జాగ్రత్తలు అవసరం


మాట్లాడుతున్న గైనకాలజిస్టు శిరీష

డాబాగార్డెన్స్, ఆగస్టు 2: కౌమారదశలోని విద్యార్థినులకు రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై తగిన జాగ్రత్తలు పాటించాలని గైనకాలజిస్టు డాక్టర్ కె.శిరిష అన్నారు. శుక్రవారం పాత జైలు రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అక్షయ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో జీవన విధాన విధానంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రిన్సిపాల్ విజయ, సీనియర్ లెక్చరర్ ఉదయశ్రీ, మాన్‌కైండ్ ఫార్మా సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి

మహారాణిపేట, ఆగస్టు 2: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణాను పూర్తి అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ కో ఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి 100 రోజుల్లో మాదక ద్రవ్యాలు, గంజాయిని పారదోలేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. వివిధ మార్గాల ద్వారా విశాఖకు గంజాయిని తరలిస్తున్నారని, వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసు కుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, విశ్వ విద్యాల యాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్ పకీరప్ప, అధికారులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రిలో చిల్లర దొంగతనాలు

- రోగుల సహాయకులను టార్గెట్ చేసి చోరీలు
- ఇటీవల రెండు బ్యాగులు మాయం
- పని చేయని సీసీ కెమెరాలు
- మందుబాబుల ఆగడాలతో వైద్యవర్గాల్లో ఆందోళన


ఘోష ఆస్పత్రి, పనిచేయని సీసీ కెమెరాలు

జగదాంబ కూడలి, ఆగస్టు 2: ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రిలో దొంగల భయం నెలకొంది. గర్భిణులు, స్త్రీలకు సంబంధించి వైద్య చికిత్సల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడి వస్తుంటారు. వన్‌టౌన్ పరిసర ప్రాంతాల గర్భిణులు ప్రసవానికి ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. దీంతో నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల సహాయకులు విశ్రాంతి గదుల వద్ద ఆరుబయట తమ సామగ్రితో నిరీక్షిస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు విజృంభిస్తున్నారు. అందినకాడికి దోచుకుపోతున్నారు. ఆదమరిస్తే బ్యాగులు, సెల్‌ఫోన్లు, నగదు మాయమవుతోందని వాపోతున్నారు. ఇటీవల రోగుల సహాయకుల కోసం ఏర్పాటుచేసిన విశ్రాంతి గది వద్ద ఉన్న రెండు బ్యాగులను క్షణాల్లో దొంగలుమాయం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా ఇక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకునే అవకాశం లేకుండా పోతోంది.

మందుబాబుల హల్‌చల్

దీనికి తోడు ఆస్పత్రి ఆవరణలో ఇటీవల మందుబాబులు సంచరిస్తున్నారు. మద్యం మత్తులో చిందులు తొక్కుతూ భయాందోళనకు గురిచేస్తున్నారు. ఇక్కడ అధికశాతం మహిళా వైద్యులే పనిచేస్తుంటారు. ప్రసవం కోసం చేరిన వారితో పాటు వారి సహాయకుల్లో ఆడవారే ఎక్కువమంది. రాత్రి సమయంలో బిడ్డలకు రక్షణ లేని పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలి



ఘోషా ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి. వన్‌టౌన్ పోలీసులు నైట్ రౌండ్స్ తిరగాలి. మందుబాబులు, దొంగల భయంతో వైద్య వర్గాలు, రోగులు, సహాయకులు భయంతో వణికిపోతున్నారు. గతంలో కంటే పోలీస్ పర్యవేక్షణ మరింత పెంచాల్సి ఉంది. ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలి.

– డాక్టర్ ఉషాప్రసాద్, సూపరింటెండెంట్

తల్లి పాలు శిశువులకు శ్రేష్ఠం

అక్కయ్యపాలెం, ఆగస్టు 2: తల్లి పాలలో ఉన్న పోషక విలువలు శిశువుకు ఎంతో మేలు చేకూర్చుతాయని ఐసీడీఎస్ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. గ్రేటర్ 42వ వార్డు రెల్లివీధి రైల్వేన్యూకాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం ప్రపంచ తల్లి పాలవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ అందుకోసం గర్భిణులు, బాలింతలు 2-3 సంవత్సరాల వరకు పిల్లలకు తమ పాలివ్వాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.కుమారి, మెడికల్ ఆఫీసర్ హెచ్‌వీ వరలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆశాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, బేగం, పార్వతి, ఏఎన్‌ఎం ఆశ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



సీతమ్మధార, ఆగస్టు 2: రేసపువానిపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో ఆషాఢమాస పూజల్లో భాగంగా అమ్మవారిని శాకంబరి గా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గురునాథరెడ్డి, సెక్రటరీ బాచీ, ఈశ్వరరావు, అర్జునరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న జనసేన నార్త్ కన్వీనర్ ఉషాకిరణ్

మద్రిపాలెం, ఆగస్టు 2: జనసేన పార్టీ సభ్యత్వ నమోదును గ్రేటర్ పరిధి 54వ వార్డులో విస్తృతంగా చేపడుతున్నారు. వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్ అధ్వర్యంలో శుక్రవారం మద్రిపాలెంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉత్తర ని యోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొన్నారు. స్వచ్ఛందంగా వచ్చినవారికి సభ్యత్వ నమోదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ విధివిధానాలు, పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా పార్టీ చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నరన్నారు. సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు పరిహారం పొందేలా పార్టీ చర్యలు చేపట్టి నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు కడిమి సీతారాం, దోగ్గా సురేంద్ర సంతోష్, మంజుల, గౌరి, రాము, పూడి గణేష్, లక్ష్మి, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని వన్‌టౌన్‌లో వివేకానంద స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టరు సీఎంఈ జహీర్ అహ్మద్ నేతృత్వంలో 100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. సంస్థ కార్యాలయంనుంచి పాత పోస్టాఫీసు మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు. జాతికి చేసిన సేవలపాటు ఆయన రూపొందించిన జాతీయ జెండా విశిష్టతకు భావితరాలకు తెలియజేయాలని ఈ ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మక్సూద్ అహ్మద్ పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పింగళి వెంకయ్య వర్ధంతి 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి చి త్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

కళాశాలను సందర్శించాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం


విష్ణుకుమార్ రాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కె.వి.రమణ

కంచరపాలెం, ఆగస్టు 2: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించాలని ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును కలిసి ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ శుక్రవారం కోరారు. సీనియర్ అధ్యాపకులు డా.బీవీ లక్ష్మణరావుతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కళాశాలకు ఢిల్లీ వారు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ మంజూరు చేసిన సందర్భంగా కళాశాలను సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి

సీతమ్మధార: గత వైసీపీ ప్రభుత్వం అసంబద్ధ వైఖరితో అన్యాయానికి లోనైన గ్రూప్1, గ్రూప్-2 పరీక్షల అభ్యర్థులకు న్యాయం కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్‌కుమార్ వినతి పత్రం అందచేశారు. జాబ్ క్యాలెండర్‌కు సంబంధించిన అన్ని ప్రభుత్వ అకాడమీ పుస్తకాలను అందుబాటులోకి తేవాలని, విశ్వవిద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం చేపట్టాలని, ఉద్యోగ వయోపరిమితి 47కు పెంచాలని కోరారు. చట్టసభలో నిరుద్యోగ యువతకు స్థానం కల్పిస్తే వారి సమస్యలు వారే నేరుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

4న వైసీపీ నేతల భూ కబ్జాలపై మదనపల్లెలో సదస్సు


మాట్లాడుతున్న రామకృష్ణ

జ్ఞానాపురం, ఆగస్టు 2: వైసీపీ నాయకుల భూ కబ్జాలపై ఈ నెల 4వ తేదీన మదనపల్లెలో సదస్సు ని ర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. నగరంలో గురువారం నిర్వహించిన జిల్లా పార్టీ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో ఆయన తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. మదనపల్లెలో ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే రెవెన్యూ రికార్డులను తగలబెట్టారని, దీనికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని కుంటి సాకు చేప్పే ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ వైసీపీ నా యకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో నియంత మాదిరిగా జగన్ పరిపాలన సాగించారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, నాయకులుసత్యనారాయణ, ఎ.విమల, మన్మధరావు పాల్గొన్నారు.

నేవల్ ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్‌షాప్

విశాఖపట్నం, ఆగస్టు 2: నేవల్ ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశంపై శుక్రవారం ఐఎన్‌ఎస్ డేగాలో వర్క్‌షాప్ జరిగింది. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహనరాజు ఏవియేషన్ ప్రణాళికలు, డిజైనింగ్, కన్‌స్ట్రక్షన్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డెలిగేట్లు ఐఎన్‌ఎస్ డేగాలోని ఎయిర్‌ఫీల్డ్ ప్రాజెక్టును సందర్శించారు.

క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి: కలెక్టర్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు సంభవించిన సందర్భంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించి కాపాడాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు గాయపడితే ఆరోగ్యశ్రీ ద్వారా నగదు రహిత చికిత్స అందించాలని సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గ్రిల్స్, మరమ్మతులు నెలరోజుల్లో పూర్తిచేయాలన్నారు. జాతీయరహదారులపై సైన్‌బోర్డులు, వేగ పరిమితులు తెలిసేలా నెలాఖరులోగా బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులతోపాటు వెనుక ఉన్న వ్యక్తులు కూడా విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ సందర్భంగా సంగం శరత్ థియేటర్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించిన గుడ్ సమారిటన్‌లు వై.రాజు, రావి వెంకటరావుకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున పారితోషికం అందజేశారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జాయింట్ సీపీ ఫకీరప్ప, రవాణాశాఖ అధికారి రాజారత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీకి సేవలందించిన వారికి గుర్తింపు: గండి బాబ్జీ

మహారాణిపేట, ఆగస్టు 2: తెలుగు దేశం పార్టీకి సేవలందించిన న్యాయ వాదు లను గుర్తించి తగిన పదవులతో వారిని గౌరవిస్తామని ఆ పార్టీ జిల్లా గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విశాఖ నగరంలోని న్యాయ వాదులు వివిధ విభాగాల నామినేటెడ్ పదవులను ఆశిస్తూ బాబ్జీకి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు బి. రాజశేఖర్, గొంప సత్య నారాయణ, భరత్ వేణు, సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, అప్పలనాయుడు, సతీష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో 100 రోజుల ప్రణాళిక

- అధికారుల కసరత్తు..అభివృద్ధి పనుల పూర్తికి యత్నం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు రావడంతో రాబోయే వంద రోజుల్లో చేయబోయే పనులపై ప్రతి శాఖ ఒక ప్రణాళిక రూపొందించుకుంటోంది. వంద రోజుల పరిపాలన పూర్తి అయ్యేసరికి ఏమి చేశామో ప్రజలకు వివరించడానికి ఇది ఉపయోగపడుతుందని ప్రభుత్వ పెద్దల ఆలోచన. అందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని శాఖలు, ముఖ్య అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించింది. ఈ మేరకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో కూడా 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కొత్త పనులు చేపట్టే అవకాశం లేకపోవడం వల్ల ప్రస్తుతం జరుగుతున్న పనులనే వంద రోజుల్లో పూర్తిచేసేలా ప్లాన్ తయారు చేసుకొని, దానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేయాలని భావిస్తున్నారు. కమిషనర్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, అకౌంట్స్, ఎస్టేట్, అర్బన్ ఫారెస్ట్ విభాగాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. త్వరగా పూర్తిచేయడానికి అవకాశం ఉన్న రహదారులు, ఇప్పటికే చేపట్టి పూర్తి కావలసిన ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి, ప్లాట్ల విక్రయాలు, లేఅవుట్ల క్లియరెన్స్, వివిధ వాణిజ్య సముదాయాల నుంచి రావలసిన అద్దెల వసూళ్లు, ప్రభుత్వం నుంచి రావలసిన భూముల వ్యవహారాలు, ఇలా అన్నింటిని ప్రాధాన్య క్రమంలో పెట్టుకొని, వాటిని సమీక్షించుకుంటూ వంద రోజుల్లో పూర్తిచేసి ప్రగతిని చూపించాలని యోచిస్తున్నారు. ఈ ప్రణాళిక మూడు, నాలుగు రోజుల్లో ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి.

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెంలో రేషన్ డిపోల్లో నిల్వ చేసిన బియ్యాన్ని మూడు ఆటోల్లో చోడవరం తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని డిపో నంబరు-2పై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి రిజిస్టర్‌లో పేర్కొన్న సరకు కంటే 274 కిలోలు అదనంగా ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో డిపోకు కేటాయించిన సరకు మొత్తం సీజ్ చేసి డిపో నంబరు-3కు అప్పగించారు. డిపో నంబరు-2పై 6-ఎ కేసు నమోదుచేశారు. కాగా పరదేశిపాలెం, రైల్వేన్యూ కాలనీలో వేర్వేరుగా దాడులు చేసి 970 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో అక్రమంగా బియ్యం వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు హెచ్చరించారు.

బొత్స ఎంపికపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆశావాహులు ఎంతోమంది...

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వైసీపీలో అనేక మంది సీనియర్ నాయకులు ఉన్నారు. తాజా మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌లు ఈ ఎమ్మెల్సీ సీటును బలంగా కోరుకున్నారు. అలాగే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పోటీ చూసి ఊహించని విధంగా క్రాస్ ఓటింగ్ వల్ల ఓడిపోయిన మత్స్యకార నాయకుడు కోలా గురువులు కూడా ఈ సీటు తనకే వస్తుందని భావించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలో కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌టీ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యానారాయణరాజు, గాజువాక నియోజక వర్గంలో చింతలపూడి వెంకట్రామయ్య విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కేకే రాజు...ఇలా పార్టీలో చాలా మంది ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. కానీ వీరందరినీ కాదని పక్క జిల్లా విజయనగరానికి చెందిన బొత్సను తీసుకువచ్చి అభ్యర్థిగా ప్రకటించారు. ఇది విశాఖ జిల్లా నాయకులను అవమానించినట్టేనని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విజయనగరం జిల్లాలో పదవులన్నీ బొత్స కుటుంబానికే కట్టబెట్టారని, పార్టీ ఓడిపోయిన తరువాత కూడా ఆ కుటుంబం హవానే సాగాలనే ధోరణి అధిష్ఠానంలో కనిపిస్తున్నదని, అయితే అది ఆ జిల్లాకే పరిమితమైతే బాగుండేదని, పొరుగు జిల్లాకు తీసుకువచ్చి ఆయన నాయకత్వాన్ని రుద్దడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది పార్టీ అభ్యర్థి విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే.

నష్టాల్లో కూరుకుపోతున్న ఉక్కు

... 5వ పేజీ తరువాయి

ధరలో టన్నుకు రూ.5 వేల రూపాయల వ్యత్యాసం ఉంటోంది. అదే లాభాలపై ప్రభావం చూపుతోంది.

అత్యవసరం పేరుతో టన్ను రూ.14 వేలు చొప్పున కొనుగోళ్లు

విశాఖ స్టీల్‌కి ఐరన్‌ఓర్‌ను ఎన్‌ఎండీసీ సరఫరా చేస్తోంది. ఇటీవల కాలం ఓర్ ఇవ్వడానికి ఇబ్బంది పెడుతోంది. ప్రైవేటు కంపెనీలకు అమ్ముతోంది. డిమాండ్‌కు తగినంత ఇవ్వడం లేదు. దాంతో అత్యవసరమై బయట కొనాల్సి వస్తోంది. ఎన్‌ఎండీసీ నుంచి టన్ను రూ.10 వేలకు రావలసి ఉండగా, అదే సరకు దాని కంటే నాణ్యత తక్కువ ఉన్నదానిని మార్కెట్‌లో టన్ను రూ.14 వేలు చొప్పున కొంటున్నారు. దీంతో నష్టాలు ఎక్కువవుతున్నాయి. ఇక్కడే కొనుగోలు అధికారం ఉన్న అధికారులు చేతివాటం చూపుతున్నారు. కమీషన్లు ఎక్కువ ఇచ్చిన వారి దగ్గరే కొని సొంత లాభం చూసుకుంటున్నారు. అన్ని రకాల ముడి పదార్థాలందించి, పూర్తిస్థాయిలో ప్లాంటు నడిపితేనే విశాఖ స్టీల్ పరిస్థితి మెరుగుపడుతుంది. ఎంత ఉత్పత్తి చేసినా స్థిర వ్యయాలు (32 శాతం) ఒక విధంగానే ఉంటాయి. మూడు బ్లాస్ ఫర్నేసులు పనిచేసినా అదే వ్యయం, రెండు పనిచేసినా అదే వ్యయం. కొంత కాలంగా రెండు బీఎఫ్‌లు మాత్రమే పనిచేయడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, నష్టాలు వస్తున్నాయి.

ఐరన్‌ఓర్‌కు వెచ్చిస్తున్న మొత్తం టన్నుకు ఇలా ఉంది.

ఏడాది	విశాఖ ఉక్కు	సెయిల్	వ్యత్యాసం
2017-18	రూ.6,584	రూ.2,396	రూ.4,188
2018-19	రూ.7,869	రూ.2,909	రూ.4,960
2019-20	రూ.7,494	రూ.2,977	రూ.4,517
2020-21	రూ.8,738	రూ.3,147	రూ.5,591
2021-22	రూ.12,493	రూ.5,012	రూ.7,481
2022-23	రూ.9,346	రూ.4571	రూ.4,775

అక్రమ తవ్వకాలపై గనుల శాఖ కొరడా

... 5వ పేజీ తరువాయి

గనుల శాఖ సర్వేలో తేలింది. దీనిపై గత నెలలో సర్వే నిర్వహించి 52,692 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, 22,582 క్యూబిక్ మీటర్ల రాయి మొత్తం 75,274 క్యూబిక్ మీటర్లు తవ్వినట్టు నిర్ధారించింది. దీంట్లో కొంత గ్రావెల్ సమీపంలో ఒకచోట నిల్వ చేసినట్టు గుర్తించారు. దీనిపై గత నెల 18వ తేదీన హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవపలర్స్ యజమాని జగదీశ్వరుడుకు జీపీఏగా ఉన్న గన్నమని వెంకటేశ్వరరావుకు షోకాజ్ ఇచ్చి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నోటీసుకు గన్నమని వెంకటేశ్వరరావు వివరణపై సంతృప్తి చెందని గనుల శాఖ, రూ.5,43,394.37 జరిమానా చెల్లించాలని శుక్రవారం డిమాండ్ నోటీస్ జారీచేసింది. గనుల శాఖ నిబంధనల మేరకు 75,274 క్యూబిక్ మీటర్లకు రూ.44,03,520 వసూలు చేయాలి. కానీ అనుమతి లేనందున చెల్లించాల్సిన మొత్తంపై పదింతలు వసూలుచేస్తారు. దీనికి పలు రకాల పన్నులు అదనం. వెరసి రూ.5.43 కోట్లు చెల్లించాలని తాజాగా నోటీస్ జారీచేశారు. కాగా సిరిపురంలో సీబీసీఎన్‌సీ స్థలంలో తవ్వకాలకు సంబంధించి మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సుమారు రెండు కోట్లకు డిమాండ్ నోటీస్ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఏయూలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. గతనాలుగేళ్లుగా వీటిని టెండర్లు లేకుండానే కొనుగోలు చేస్తుండడంవెనుకున్న మర్మంపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ ఎందుకు మూసివేసినట్టో..?

ఏయూలో ఏళ్ల తరబడి ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను గత పాలకులు మూసివేశారు. దీనికి గల కారణాలను అప్పట్లో చెప్పలేదు. పరికరాలు పాడయ్యాయని, కొనుగోలు చేసేందుకు పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తుందన్న కారణాలను చూపించారు. సుమారు 60 ఏళ్లకు పైబడి చరిత్ర కలిగిన ఈ ప్రెస్‌లోనే వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు, దూర విద్యకు సంబంధించి మెటీరియల్‌ను ప్రింట్ చేసేవారు. కానీ, సాంకేతిక ఇబ్బందులు, ఖర్చు పెరుగుతోందన్న కారణాన్ని చూపించి ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేశారు. ఆ తరువాత తమకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు అప్పగించుకుని ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు. ఈ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేసిన తరువాత ఇక్కడ పనిచేసే సుమారు 18 మంది టెక్నికల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో నాన్ టెక్నికల్ సేవల్లో వినియోగించుకుంటున్నారు.

వైద్యం అందించకుంటే ఆస్పత్రులపై చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులుంటే మిత్రలు దృష్టికి తీసుకు వెళ్లవచ్చునన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే తనకు (నంబర్ 9281068145)కు ఫిర్యాదు చేయాలన్నారు. నెట్ వర్క్ ఆస్పత్రుల్లో రోజుకు కనీసం వేయి మంది వరకు కొత్తగా చేరుతున్నారన్నారు. తాను ప్రతిరోజూ ఒక ఆస్పత్రిని తనిఖీ చేస్తున్నట్టు వెల్లడించారు. రోగులతో మాట్లాడి ఇబ్బం దులను తెలుసుకుంటున్నట్టు వెల్లడించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అదనంగా డబ్బులు అడుగుతున్నారని చెబుతున్నారని, వెంటనే చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఆరిలోవ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

ఆరిలోవ, ఆగస్టు 2 : బాలాజీ నగర్ జంక్షన్ నుంచి ఆరిలోవ రిఫరల్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుకి రెండు వైపులా దుకాణదారులు పలకలు వేసి, వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనాల రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ విషయమై స్థానికులు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా. ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఫైబర్ నెట్ సేవల్లో అంతరాయం

రామ్‌నగర్, ఆగస్టు 2 : రామ్‌నగర్ ప్రాంతంలో ఏపీ ఫైబర్ నెట్ సక్రమంగా పని చేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ ఫైబర్ నెట్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అతి తక్కువ ధరకే నాణ్యమైన టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం వీటి ప్రసారాల పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రసారాల్లో నాణ్యత లేకపోగా నెట్ ప్రసారాలు కూడా అత్యంత దారుణంగా ఉంటున్నాయి.రామ్‌నగర్‌తో పాటు సమీపంలోని పలు ప్రాంతాలకు నెట్ ప్రసారాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. కనెక్షన్ ఉన్న వారు తమకు ప్రసారాలు ఎందుకు రావడం లేదు, ఎప్పుడు వస్తాయో తెలుసుకోవడానికి కూడా ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం, సంస్థ ప్రతినిధులను ఫోన్ ద్వారా సంప్రతించాలనుకున్నా ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో చాలామంది వినియోగదారులు ఇప్పటికే ఇతర నెట్‌వర్క్‌లకు మారిపోయారు. మిగిలిన వారు సేవల్లో అంతరాయం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

సింహాచలం, ఆగస్టు 2 : మహావిశాఖ 98వ వార్డులోని సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రహరీకి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆసుపత్రి పశ్చిమ వైపు ప్రహరీని ఆనుకుని ఉన్న మార్గం గతంలో కంటే కొన్ని అడుగుల ఎత్తు పెరిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మరింత దిగువగా ఉండడంతో ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్న ఆకుల వీధి, బంగారమ్మ ఆలయం, ప్రియాగార్డెన్స్ ప్రాంతాల ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు ఎత్తు పెంచాలని పలువురు కోరుతున్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 2 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన సీఎస్‌కే సుబ్రహ్మణ్యం రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,200లను నగదు రూపంలో అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జి, ఏఈఓ పాలూరి నరసింగరావుకు శుక్రవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు పనులు పరిశీలన

సింహాచలం, ఆగస్టు 2 : జీవీఎంసీ పరిధిలోని 98వ వార్డు కాపువీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పీవి నరసింహం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, టీడీపీ నాయకుడు దాసరి పైడిరాజు, జనసేన నాయకుడు కిలారి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 150, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 30, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

- ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడండి
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- ఆరిలోవలో పర్యటన



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడతున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ, ఆగస్టు 2 : నగరంలో రోడ్లు, వీధి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 9,12 వార్డుల్లోని ఆరిలోవ, ఎర్నిదుర్గానగర్, ఎంఎస్ఎస్-2, ఎస్‌కేఎల్ఎం నగర్, సంజయ్ గాంధీ కాలనీల్లో పర్యటించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యు, అతిసారపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాలువలతో పాటు ప్రధాన గెడ్డల్లో పూడికలు తొలగించాలని, వర్షాలకు ప్రధాన కాలువల్లో కొండల నుంచి వచ్చే నీటికి వ్యర్థాలు అడ్డు పడకుండా గ్రిల్స్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని జోనల్ కమిషనర్ శైలజావల్లిని, పర్యవేక్షక ఇంజనీరు శంసన్ రాజును ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి నుంచి క్లాప్ వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. అనంతరం ఎంఎస్ఎస్-2ను సందర్శించి, చెత్త శుద్ధి కేంద్రం పని తీరును పరిశీలించారు. అలాగే తొమ్మిదో వార్డు సంజయ్ గాంధీ కాలనీలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయక వైద్యాధికారి డాక్టర్ కిశోర్, కార్యనిర్వాహక ఇంజనీరు శాంతిరాజు, ఏఎంహెచ్ఓ కిరణ్, సహాయక ఇంజనీర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న బోధనలతోనే ఉత్తమ ఫలితాలు

- సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు

ఆరిలోవ, ఆగస్టు 2 : ఉపాధ్యాయులు ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా బోధన చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. కన్నబాబు సూచించారు. శుక్రవారం ఆయన శ్రీకృష్ణాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే టెన్త్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరో తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు జరుగుతున్న బోధనను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

భీమునిపట్నం, ఆగస్టు 2 : పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో ఆరోగ్యకరమని భీమిలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. ప్రమీల అన్నారు. శుక్రవారం పట్టణంలోని అప్పికొండ వీధి, ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు.బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రిపాలు పట్టడం వల్ల బిడ్డకు ఎంతో ఆరోగ్యమని, ముర్రిపాలలో వ్యాధి నిరోధక శక్తి వుంటుందన్నారు. ఆరు నెలలు వరకూ తల్లి పాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మొకర వెంకట రమాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి అన్నారు. ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంబేడ్కర్ కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు.



పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

ఏయూలోని పలు విభాగాలు ఇన్‌చార్జి వీసీ తనిఖీ

వెంకోజీపాలెం, ఆగస్టు 2 : ఏయూలోని పలు విభాగాలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావు శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని సందర్శించారు. అక్కడ ఎంహెచ్ఆర్ఎం సెమిస్టర్ పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు నిర్వహించే బాస్కెట్ బాల్ మైదానాన్ని సందర్శించి, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సెక్యూరిటీ డీన్ ఆచార్య అరుణ్ కుమార్‌తో చర్చించారు. అక్కడి నుంచి న్యాయ కళాశాలలో జరుగుతున్న తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీసీతో పాటు ప్రిన్సిపాళ్లు ఆచార్య కె. సీతామాణిక్యం, ఏ. నరసింహారావు ఉన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

కొమ్మాది, ఆగస్టు 2 : రేవళ్లపాలెం గ్రామ దేవతలు బంగారమ్మ, భూలోకమాత అమ్మవార్లకు ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామస్తులు శుక్రవారం సారె సమర్పించారు. స్వీట్లు, పండ్లు, గాజులు, చీరలతో పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపుగా సారె తీసుకువెళ్లారు. అనంతరం ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

8న పాఠశాలల నిర్వహణ కమిటీల ఎన్నిక

భీమునిపట్నం, ఆగస్టు 2 : పాఠశాలల్లో స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈవో ఎం. శివరాణి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి పాఠశాల నోటీసు బోర్డులో హెచ్ఎంలు విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా ప్రకటించాలని చెప్పారు. జాబితాపై ఈనెల 5న అభ్యంతరాలు స్వీకరిస్తారని, అదే రోజు సాయంత్రం ఓటరు జాబితాను ఖరారు చేసి నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తారన్నారు. 8న స్కూల్ మేనేజిమెంట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల ఎన్నిక ఉంటుందని చెప్పారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 66, ప్రాథమికోన్నత పాఠశాలలు 18, హైస్కూళ్లు 21 ఉన్నాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 18, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 4 ఉన్నాయని చెప్పారు.

గంధవరం - విశాఖ బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

పద్మనాభం, ఆగస్టు 2 : మండలంలోని గంధవరం గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సు నడిపి నిలిపివేసిన 341 సర్వీసును పునరుద్ధరించాలని మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. శుక్రవారం వారు గంటాను నగరంలోని ఎంవీపీ కాలనీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ ఎంపీపీ గోపీబాబు మాట్లాడుతూ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్న గంధవరం-విశాఖపట్నం బస్సును నిలిపి వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సును పునరుద్ధరించి ప్రజల అవస్థలు తీర్చాలన్నారు. దీనిపై గంటా స్పందిస్తూ బస్సును ట్రైల్ రన్‌లో భాగంగా పునరుద్ధరించడానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలంతా ఆర్టీసీకి నష్టం కలగని రీతిలో బస్సును వినియోగించుకునేలా చూడాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గంధవరం నాయకులు గణేష్, కాళి, నరేష్‌కుమార్, స్వామినాయుడు, గౌరి, సన్యాసిరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో పందుల బెడద



మధురవాడలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు

మధురవాడ, ఆగస్టు 2 : మధురవాడ పరిసర ప్రాంతాల్లో పందుల బెడద తీవ్రంగా ఉంది. ఎక్కడికక్కడ గుంపు గుంపులుగా తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, నగరపాలెం, మల్లయ్యపాలెం, పోర్టు కాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, అయోధ్యనగర్, పాత మధురవాడ మెట్ట తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. పందులు ఇళ్లల్లోకి చొరబడుతుండడంతో ఏ క్షణాన ఎవరిపై దాడి చేస్తాయోనన్న ఆందోళన నెలకొంది. జీవీఎంసీ అధికారులు పెంపకందారులను పలుమార్లు హెచ్చరిస్తున్నా..పెద్దగా ఫలితం కనిపించడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పందులు వల్ల పారిశుధ్యం క్షీణించి రోగాలు విజృంభించే అవ కాశం ఉంది. అధికారులు స్పందించి పందులను నివాస ప్రాంతాలకు దూరంగా పెంచుకునేలా పెంపకందారులను హెచ్చరించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం : బీజేపీ

పెదవాల్తేరు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాకేష్ చంద్ర అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ మద్దతు కారణంగానే తమ పోరాటం ఫలించిందన్నారు. ప్రతిపక్ష హోదా లేని వారు కూడా తాము కూడా వర్గీకరణకు మద్దతు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్గీకరణ 59 ఉప కులాలకు ఉపయోగపడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వర్గీకరణ అంటే 59 ఉప కులాల మధ్య గొడవ కాదన్నారు. ఎస్సీలంతా తీర్పును స్వీకరించి ఐక్యమత్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కణితి విజయలక్ష్మి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంజీవరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చార్లెస్ మాధవీలత, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జామి శ్రీనివాస్, అరపల్లి హర్షద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందజేస్తున్న ట్యాక్సీ డ్రైవర్లు

ట్యాక్సీల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని వినతి

సింహాచలం, ఆగస్టు 2 : సింహాచలం తొలిపావంచా వద్ద ట్యాక్సీల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని స్థానిక సింహాద్రి ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. శుక్రవారం వారు 98వ వార్డు కార్పొరేటర్ పీవి నరసింహం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో గంటాను కలిశారు.

దాసుడి సేవలకు జ్ఞాపిక బహూకరణ

సింహాచలం, ఆగస్టు 2 : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు వరాహలక్ష్మీనృసింహస్వామికి చేసిన సేవలకు గాను దేవాలయ పర్యవేక్షణాధికారి వెంకటరమణ శుక్రవారం ఆయనకు జ్ఞాపికను, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఈఓ ఆదేశాల మేరకు దాసుడికి జ్ఞాపిక అందజేసినట్టు చెప్పారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సివిల్ జడ్జి సీతమ్మ, పీఎంపాలెం పోలీసులు

శంభువానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

కొమ్మాది, ఆగస్టు 2 : శంభువానిపాలెంలో డీఎల్ఎస్ఏ సంస్థ పీఎంపాలెం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారటీ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకట సీతమ్మ ప్రారంభించారు. కేజీహెచ్, గీతం ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఏసీపీ సునీల్, పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ, ఎస్ఐ సునీత, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపార్వతికి గౌరవ ఆచార్య హోదాను రద్దు చేయడం పట్ల హర్షం



టీడీఆర్ హబ్ ద్వారా జరిగిన ఇతర పీహెచ్‌డీలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న సమితి సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 2 : లక్ష్మీపార్వతికి గౌరవ ఆచార్య హోదాను రద్దు చేయడం పట్ల ఏయూ పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది. అలాగే టీడీఆర్ హబ్ ద్వారా జరిగిన ఇతర పీహెచ్‌డీలను కూడా రద్దు చేయాలని, ఎగ్జిక్యూటివ్ కోటాలో అనేక అవకతవకలు ఉన్నాయని, ఎయిడెడ్ ఫ్యాకల్టీకి గైడ్ షిప్‌ను రద్దు చేయాలని, ఎకనామిక్స్ హెడ్‌గా కొనసాగుతున్న ఏ డేట్ ఫ్యాకల్టీని పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఏయూ తెలుగు విభాగం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఏయూలో అడ్డదారిలో పొందిన పీహెచ్‌డీని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ మీనన్, కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి డాక్టర్ భాను సూరి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు మాధవ్, తదితరులు



డైట్‌లో వెంకయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

భీమునిపట్నం, ఆగస్టు 2 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు జీజీఎస్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకయ్య ఇండియన్ ఆర్మీలో పనిచేసి జాతీయ జెండాను రూపొందించడం, మహాత్మా గాంధీ ప్రశంసలు పొందడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్. సుధాకర్, సివి సోమయాజులు, గొట్టేటి రవి, ఎం. మహాలక్ష్మి, పి. హరిణి, జె. మాధవి పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ వెంకయ్య దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జయప్రద, ఉపాధ్యాయులు వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలరాజు, రమేష్, మల్లిక, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ

భీమునిపట్నం, ఆగస్టు 2 : కేరళలో వరద బాధితుల సహాయార్థం సీపీఎం నాయకులు పట్టణంలో శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, వూళ్ల నాగరాజు, ముఠా మేస్త్రి, గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా ధర్నా

తగరపువలస, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ తగరపువలసలోని అంబేడ్కర్ కూడలిలో మాల మహానాడు కార్యకర్తలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం నల్ల బాడ్జీలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు ఉత్తరాంధ్ర నాయకుడు భాగం గోపాలరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయకుండా వర్గీకరణ చేయడం వల్ల ఎస్సీల మధ్య వివాదాలు, విభేదాలు వస్తాయని చెప్పారు. ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ కిరణ్, సూర్యనారాయణ, ఉప్పాడ కిరణ్, ఎడ్ల రమేష్, బోని ఆదిరాజు , ఎరుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత నిత్య కల్యాణం



సింహాచలం, ఆగస్టు 2 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.